క్లుప్తంగా

ఆలయ కమిటీ ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని టీచర్స్ కాలనీలో ఆదివారం శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.విక్రమ్, ప్రధాన కార్యదర్శిగా బి.అనిల్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా గేడం తులసిదాస్, నగేశ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా భోయర్ అశోక్, తిలక్, క్యాషియర్‌గా గంగయ్య, సంయుక్త కార్యదర్శులుగా బి.వామన్, దాలే రవి కుమార్, సత్యనారాయణ, ఆర్.కృష్ణయాదవ్, సత్యనారాయణ, సంజయ్ కుమార్, రాజయ్య, అడ్వైజర్లుగా యాదవ్ రావు, బి.రమేశ్, మహేందర్, ఎం.రాజయ్య, సోషల్ మీడియా కన్వీనర్‌గా కీర్తి కుమార్, సభ్యులుగా ఆకుల శ్రీనివాస్, బి.గులాబ్ రావు, బి.వెంకటస్వామి, ప్రేమ్, వంశీ, రాజులను ఎన్నుకున్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని అంజీ గ్రామంలో పులాజీబాబా ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 25, 26న నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం వార్షికోత్సవ వేడుకల కరపత్రాలు ఆవిష్కరించారు. 25న జెండా ఆవిష్కరణ, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 26న ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రవచనలు బోధించడం జరుగుతుందన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఐటీడీఏ పీవో చహత్ బాజ్‌పాయ్‌లు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గారుశే దశరత్, ముఖడే విష్ణు, గారుశే బాలాజీ, దగ్గె విఠల్, శంకర్, రామకృష్ణ, సుధాకర్, గారుశే శ్రీరాం, సెల్కే శివ్‌రామ్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలి



మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

తాంసి: భీంపూర్ మండలంలోని పలు గ్రామాల గుండా ఉన్న అంతరాష్ట్ర రహదారి నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని భీంపూర్ కాంగ్రెస్ నాయకులు మంత్రిని కోరారు. ఆదివారం హైదరాబాద్‌లో రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలిసి రోడ్డు సమస్యపై విన్నవించారు. త్వరలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని మంత్రి చెప్పినట్లు నాయకులు తెలిపారు,. ఈకార్యక్రమంలో నాయకులు మల్లేష్, శ్రీనివాస్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం ఏదీ?



ఏర్పాటు చేసిన బోర్డు

తాంసి: యువకులకు క్రీడల ఆసక్తి పెంచాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టానుసారంగా ఏర్పాటు చేశారు. భీంపూర్ మండలంలోని గోముత్రిలో బోర్డు మాత్రమే ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.

అయ్యప్ప పూడిపూజ

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే సుమన్‌బాయి, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ ఆధ్వర్యంలో చేపట్టిన మహాపడిపూజ వైభవోపేతంగా జరిగింది. గురుస్వామి శనిగారపు చిన్నయ్య, పిసుపాటి పాపారావు, పండితులు నర్ర నితీశ్, విజయ్ ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. శ్రీకాంత్ కళా సాంస్కృతిక బృందం ఆధ్వర్యంలో గీతాలపన, భక్తుల భజనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

కొనసాగుతున్న రేషన్ ఈ-కేవైసీ

- మండలంలోని రేషన్‌షాపుల్లో 65 శాతం పూర్తి
- వచ్చే నెల 31వరకు గడువు
- పిల్లలకు ఆధార్ అప్‌డేట్ లేక అవస్థలు



జానోనిలో ఈ-కేవైసీ నమోదు చేస్తున్న రేషన్ డీలర్

బేల: మండలంలోని రేషన్‌కార్డు లబ్ధిదారుల ఈ-కేవైసీ కొనసాగుతోంది. గత సెప్టెంబర్‌లో ప్రారంభమైన ఈ-కేవైసీ ప్రక్రియ ఇప్పటివరకు 65 శాతం వరకు పూర్తయింది. మండలంలోని సాంగిడిలో అత్యధికంగా 87, అత్యల్పంగా చంపెల్లిలో 30, బేలలో 60శాతం వరకు ఈ-కేవైసీ పూర్తయింది. జనవరి 31 వరకు గడువు ఉంది. పిల్లల ఆధార్ అప్‌డేట్ లేక అవస్థలు పడాల్సి వస్తోంది. బయోమెట్రిక్, ఐరీష్ రాని వారికి సైతం ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలోని 37గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటి పరిధిలో 26రేషన్ షాపులు ఉండగా.. మొత్తం రేషన్‌కార్డులు 11,760 ఉన్నాయి. అంత్యోదయ కార్డులు 726, తెల్ల రేషన్‌కార్డులు 11,034 ఉన్నాయి. ఈకార్డులో 47వేల పైబడి లబ్ధిదారులు ఉన్నారు.

ఆధార్ అప్‌డేట్ లేక..

పిల్లలకు ఆధార్‌కార్డు జారీ చేయబడిన తేదీ నుంచి ఐదేళ్లు పూర్తైతే కచ్చితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలి. ఈ క్రమంలో కొందరు మాత్రమే అప్‌డేట్ చేసుకోగా.. అవగాహన లేకపోవడంతో అధిక సంఖ్యలో అప్‌డేట్ చేసుకోలేదు. దీంతో రేషన్ ఈ-కేవైసీ గత సెప్టెంబర్ నెల నుంచి ప్రారంభమైన క్రమంలో ఆధార్ అప్‌డేట్ లేకపోవడంతో పిల్లలకు ఈ-కేవైసీ రావడం లేదు.

ఈ-కేవైసీ తప్పనిసరి..

లబ్ధిదారుల్లోని కుటుంబ సభ్యులందరూ రేషన్ షాపుల్లో ఎక్కడైనా తప్పనిసరిగా ఈ- కేవైసీ చేసుకోవాలి. ప్రతీ లబ్ధిదారుడికి బయోమెట్రిక్ వస్తే ఈ-కేవైసీ సవ్యంగా పూర్తవుతుంది. బయోమెట్రిక్ రానీ వారికి ఐరీష్‌తో ఈ-కేవైసీ రేషన్ డీలర్లు చేస్తున్నారు. బయోమెట్రిక్, ఐరీష్ రానీ వారు ఆధార్ కార్డుకు ఫోన్ నంబరు లింక్ లేని వారు సైతం ఆధార్ అప్‌డేట్ తప్పరిసరిగా చేసుకోవాలి. లేదంటే ఈ-కేవైసీ కాదు.

ఆధార్ అప్‌డేట్ కోసం ఆదిలాబాద్‌కే..

ఆధార్ అప్‌డేట్ కోసం జిల్లా కేంద్రమైన ఆదిలాబాద్‌కే పరుగులు తీయాల్సి వస్తోంది. మండల కేంద్రాల్లో ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో ఆదిలాబాద్‌లోని ఆధార్ కేంద్రాల్లో ఇతర ప్రాంతాల వారు బారులు తీరుతున్నారు. రద్దీ పెరిగి ఒక్కోసారి మరుసటి రోజు రామ్మని టోకెన్‌లు ఇస్తున్నారు. దీంతో ఆధార్ అప్‌డేట్ కోసం రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధార్ అప్‌డేట్ కోసం పలుమార్లు జిల్లా కేంద్రానికి వెళ్లక తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానికంగా ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

బేల: ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి.. ఆధ్యాత్మికత అలవర్చుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. ఆదివారం మండలంలోని పాటన్ గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫైజుల్లాఖాన్, బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, రాత్రే మురళీధర్, బోనిగిరివార్ గణేష్, రాత్రే సందీప్, తదితరులు పాల్గొన్నారు.

సుందర చైతన్యానంద స్వామిని కలిసిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హైదరాబాదులోని దుండిగల్ ఆశ్రమంలో ఆదివారం సుందర చైతన్య నంద స్వామిని కలిసి ఆయనకు 76వ జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామీజీని శాలువాతో సన్మానించారు.

సీసీఐ కేంద్రాల వద్ద దళారుల రాజ్యం



నేరడిగొండలో జిన్నింగ్ మిల్లు వద్ద బారులు తీరిన వాహనాలు

- గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరకే కొనుగోలు
- రైతులకు అనేక కొర్రీలు పెడుతున్న సీసీఐ అధికారులు
- దళారుల నుంచి నేరుగా కొనుగోళ్లు



జిన్నింగ్‌లో పత్తి నిల్వలు

నేరడిగొండ: రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాలు దళారులకు వరంగా మారాయి. దళారులు గ్రామీణ ప్రాంతాల్లో తక్కువ ధరలకే పత్తిని కొనుగోలు చేసి సీసీఐ కేంద్రాల వద్ద గరిష్ఠ మద్దతు ధరను పొందుతున్నారు. జిల్లాలోని నేరడిగొండ, బోథ్, ఇచ్చోడ, ఆదిలాబాద్, గుడిహత్నూర్ తదితర ప్రాంతాల్లోని కాటన్ మిల్లులో దళారులు ఆడిందే పాట.. పాడిందే పాట అన్న చందంగా మారిందని అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్యం పదుల సంఖ్యలో పత్తి లోడ్‌తో వాహనాలు సీసీఐ కేంద్రాలకు వస్తున్నాయి. దళారులు వాటిని సీసీఐకి విక్రయిస్తున్నారు. వాటిని సీసీఐ నిర్వాహకులు నేరుగా కొనుగోలు చేస్తున్నారు. రైతులు తీసుకెళ్తే అనేక సాకులు చెబుతూ మద్దతు ధర కంటే తక్కువ ఇస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కేంద్రాల వైపు అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో కొనుగోలుదారుల ఇష్టారాజ్యంగా మారిందని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దీంతో దళారులు రాజ్యమేలుతున్నారు. రైతుల వద్ద తక్కువకు కొనుగోలు చేసి, ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. అందినకాడికి దండుకుంటూ.. రైతులను నిండా ముంచుతున్నారు.

దళారులకే మద్దతు ధర



ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పత్తి కొద్దిమేర తడిచింది. దీనిని సాకుగా చూపి రైతులు తెచ్చిన పత్తికి మద్దతు ధర కంటే తక్కువ ధర కల్పిస్తున్నారు. దళారుల పత్తికి మాత్రం ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నారు.

– కుంట కిరణ్ కుమార్‌రెడ్డి, బోథ్ ఏఎంసీ డైరెక్టర్

అవకతవకలకు అవకాశం లేదు



సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద అవకతవకలకు అవకాశం లేదు. రైతుల పేరుపై ఉంటేనే పత్తి కొనుగోలు చేస్తున్నారు. దళారులు అక్రమ పద్ధతిలో సీసీఐకి పత్తి అమ్మినట్లయితే చర్యలు తీసుకుంటాం.

– పుల్లయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

సమీక్షా సమావేశానికి జిల్లా నాయకుల హాజరు



గాంధీభవన్‌లో కాంగ్రెస్ నాయకులు

బోథ్: టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆదివారం నిర్వహించిన సమీక్ష సమావేశానికి బోథ్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. జిల్లాలోని సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. సమావేశంలో చంటి, కల్యాణం రాజేశ్వర్, నారాయణ, ఇమామ్, శేఖర్, మహేందర్, కరుణాకర్, మల్లేష్, గుడాల శేఖర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు లింగాల చిన్నన్న డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు యూనిఫాం అందజేయాలన్నారు. అదేవిధంగా కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తులను ఆదుకోవడమే ధ్యేయం



అవగాహన కల్పిస్తున్న రాజుయాదవ్

బోథ్: అంతరించిపోతున్న కులవృత్తులను ఆదుకునేందుకే ప్రధానమంత్రి మోదీ3 పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రవేశపెట్టారని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గొర్ల రాజు యాదవ్ అన్నారు. ఆదివారం సొనాల గ్రామంలో పథకంపై కులవృత్తిదారులకు అవగాహన కల్పించారు. విశ్వకర్మ యోజన పథకాన్ని రూ. 13వేల కోట్లతో ప్రారంభించడం జరిగిందని తెలిపారు. 18 రకాల కుల వృత్తుల వారికి పథకం ద్వారా ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో కులవృత్తిదారులు, నాయకులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: వినియోగదారులు హక్కులపై అవగాహన ఉండాలని వినియోగదారుల సంస్థ అధ్యక్షుడు కిరణ్ కుమార్ అన్నారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌లో వినియోగదారులకు హక్కుల గురించి అవగాహన కల్పించారు. అంతకుముందు వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ 1986 డిసెంబర్ 24న వినియోగదారుల హక్కులను పరిరక్షించేందుకు చట్టం అమలులోకి వచ్చిందన్నారు. వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా రశీదు తీసుకోవాలన్నారు. ఏవైనా మోసాలకు గురైతే వినియోగదారుల ఫోరాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లేష్, ఇర్ఫాన్, శివ, షేక్ చాంద్, రాకేష్, కృష్ణవేణి, హేమలత, ఎల్లమ్మ, పుష్ప, చిట్టిమ్మ, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాసంక్షేమమే సీపీఐ లక్ష్యం'



సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

తాంసి: ప్రజా సంక్షేమమే సీపీఐ లక్ష్యమని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. మండలంలో ప్రజా సమస్యలపై సీపీఐ అనేక పోరాటాలు చేసిందని గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి లాభం చేకూరడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు సట్వాజీ, రేండ్ల రతన్, అశోక్, సతీష్, సట్వాజీ, పోచ్చన్న, రాములు పాల్గొన్నారు.

- తాంసి మండలంలోని గోట్కూరిలో సీపీఐ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, చిల్క దేవిదాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అర్థాంగి రమేశ్, కిష్టన్న, కొండ విట్టల్, బత్తుల రాజన్న, బత్తిన విలాస్, తులసి నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

'పదవికి రాజీనామా చేయాలి'



మాట్లాడుతున్న నాయకులు

బేల: బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ముందుగా తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల యూత్ నాయకులు సతీష్‌పవార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న చొరవతో ఎన్నో పదవులు అనుభవించి, ప్రస్తుతం పార్టీకి రాజీనామా చేయడం సరికాదన్నారు. అడ్డి భోజారెడ్డి వెనుక కార్యకర్తలు లేరన్నారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, నాయకులు రాత్రే గంభీర్, జక్కుల మధుకర్, బాలచందర్, జితేందర్, గోడం సునీల్, ఇంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

తాంసి: డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి చైర్మన్ పదవికి రాజీనామా చేయాలని భీంపూర్ మండల బీఆర్ఎస్ కన్వీనర్ నాగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం భీంపూర్ మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన చైర్మన్, అదేవిధంగా సొసైటీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేయాలన్నారు. బీఆర్ఎస్ తరపున పదవులు పొంది ఇప్పుడు రాజీనామా చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సుధాకర్, అఫ్రోజ్, నితిన్, రవీందర్, రాజు, లింబాజీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులకు ఓ ప్రైవేట్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆదిత్య కళాశాలలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా ప్రకాంత్, పూర్ణచందర్, రజితలు వ్యవహరించారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాజరి శ్రీకాంత్, రవితేజ, గౌరవ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



సరుకులు అందజేస్తున్న స్నేహితులు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన రాజశేఖర్ గతనెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న స్నేహితులు నిరుపేద కుటుంబానికి అండగా నిలిచారు. రూ. 10 వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. రాజశేఖర్ కుటుంబానికి అండగా నిలుస్తామని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ధరంసింగ్, నవీన్, నాతరి, మల్లేశ్, రాజ్‌కుమార్, పోషన్న పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీ



వ్యవసాయంలో రైతులు సాంకేతికతను ఉపయోగించుకుంటున్నారు. బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన రైతు కుమ్మరి ప్రవీణ్ కుమార్ తన చేనులో పంటకు పురుగుల మందను డ్రోన్‌తో పిచికారీ చేయించారు. డ్రోన్‌తో పిచికారీ చేయిస్తే తక్కువ సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని తెలిపాడు. – బోథ్

క్రిస్మస్ సందడి

జిల్లా వ్యాప్తంగా చర్చిల్లో క్రిస్మస్ సంబురాలు మొదలయ్యాయి. ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. చర్చిల వద్ద ప్రత్యేక అలంకారణాలు ఆకట్టుకున్నాయి.



తాంసి సెయిట్ థామస్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్



ఆదిలాబాద్: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

రోడ్డు పనులు ప్రారంభించాలి



ఎమెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: మండలంలోని మామిడిగూడ గ్రామానికి రోడ్డు, వాగుపై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, వెంటనే పనులు ప్రారంభించాలని మామిడిగూడ గ్రామస్తులు కోరారు. ఆదివారం ఉట్నూర్ ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు, వంతెన పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుడే కైలాస్, గ్రామ పెద్దలు సెడ్మకి భీంరావ్, మెస్రం గంగారాం, మెస్రం లక్ష్మణ్, పెందోర్ ఇంద్రు, వెట్టి భుమేష్, సిడాం ప్రభు, తొడసం రాజు పాల్గొన్నారు.